క్లుప్తంగా

రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడవచ్చు

ఏపీటీడీసీ డీవీఎమ్ కృష్ణచైతన్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): రక్తదానం ఒక పవిత్ర కార్యక్రమమని, తద్వారా నలుగురి ప్రాణాలను కాపాడవచ్చని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డివిజనల్ మేనేజర్ కృష్ణచైతన్య తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని భవానీపురంలోని హరిత బెరంపార్క్ (పున్నమి హోటల్)లో బుధవారం రెయిన్‌బో బ్లడ్ సెంటర్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏపీటీడీసీ, బీఐటీసీ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కాన్వాస్‌పై ఆయనతోపాటు పలువురు సంతకాలు చేసి దేశ సమైక్యతను చాటారు. కార్యక్రమంలో బెరంపార్క్ మేనేజర్ కె శ్రీనివాస్, ఏఎమ్ కొల్లి శ్రీధర్, బీఐటీసీ మేనేజర్ రవీంద్ర, ఎకౌంట్స్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం విజయవాడకు చెందిన శ్రీధార ది ఆర్ట్ ల్యాండ్‌కు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య భక్తులకు ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద ధర్మపథం వేదికపై నృత్య బృందానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని శ్రీమేథ విద్యా సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ అన్నారు. నగరంలోని శ్రీ మేథ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. నగరంలోని ఏటీపీ కళ్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలను తొలుత చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నంద కిషోర్ మాట్లాడుతూ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులు ఒకరితో ఒకరికి పరిచయమేర్పడి కలిసిమెలిసి విద్యను అభ్యసించడానికి అనువుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మోటివేషనల్ స్పీకర్ అయ్యప్ప మాట్లాడుతూ ఉలి దెబ్బలకు ఓర్చుకున్న రాయి దైవశిల్పంగా మారి పూజలందుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సీఎంఏ ఫౌండేషన్ ఫలితాలు ఆలిండియా మొదటి ర్యాంకులు సాధించిన అన్నా దీరజ్, షేక్ ఇర్ఫాన్‌లను మెమొంటోలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పునః పరిశీలించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఈ నెల 21న భారత్ బంద్, 24న అన్ని మాల సంఘాలతో విజయవాడలో విస్తృత స్థాయి సమావేశం, నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవం నాడు మాలల మహా గర్జన నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడారు.









స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధం

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ప్రభుత్వం గురువారం నిర్వహించే కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ పథకాలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించేందుకు సిద్ధం చేశారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ నగరంలో బుధవారం పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు భారీ జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీలు నిర్వహించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





హర్ ఘర్ తిరంగాతో జాతీయ సమైక్యత

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎంపీ కేశినేని చిన్ని

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశ ప్రజల్లో జాతీయ భావం, దేశభక్తి పెంపొందేలా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జాతీయ సమైక్యతను చాటుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా త్రివర్ణ శోభితమైన సుమారు 3303 అడుగుల జాతీయ పతాక ర్యాలీ విద్యాధరపురంలోని స్టేడియం గ్రౌండ్ నుంచి బయలుదేరగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. విద్యార్థులు పట్టుకున్న భారీ తిరంగా జెండాను వారు పరిశీలించిన అనంతరం ర్యాలీ ముందు జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీని ముందుకు నడిపించారు. తిరంగా ర్యాలీ వన్‌టౌన్ పంజా సెంటర్ వద్ద ముగియగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఉండే పశ్చిమ నియోజకవర్గం దేశ సమైక్యతను పెంచే విధంగా జరిగిన ఈ ర్యాలీ స్వాతంత్య్రోద్యమంలో అశువులుబాసిన యోధుల స్ఫూర్తిని నేటి తరానికి అందించిందని తెలిపారు. మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య ఉమ్మడి కృష్ణా జిల్లా ముద్దుబిడ్డ కావడం మనకు గర్వకారణమన్నారు. స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న పోరాట యోధులు, త్యాగధనుల చరిత్రను తెలుసుకుని వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆదేశాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలన్నారు. దేశంలో భిన్న మతాలు, కులాలు ఉన్నప్పటికీ అందరం భారతీయులమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బుద్దా వెంకన్న, అడ్డూరి శ్రీరామ్, తిరుపతి అనూష తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శి అక్రమాలు బయటపెట్టాననే కక్ష

- అందుకే నా ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు
- న్యాయవాది ముప్పి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్గదర్శి అక్రమాలపై న్యాయ పోరాటం చేసినందుకే ఈనాడు దిన పత్రిక తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వార్తా కథనాలు రాస్తోందని న్యాయవాది ముప్పి శ్రీనివాసరావు అన్నారు. ఆ పత్రిక కథనాలను శ్రీనివాసరావు ఖండించారు. బుధవారం విజయవాడ గవర్నర్‌పేటలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్గదర్శి లబ్బీపేట బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న బండారు శ్రీనివాస్ అవినీతి బాగోతం బయటపెట్టానన్నారు. ఆయన అనేక మోసాలకు పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనాడు దిన పత్రికలో తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వార్తా కథనాలు రాయిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి తాను ఇంట్లో ఒంటరిగా ఉంటున్నానన్నారు. తాను లేని సమయంలో ఇంటికి వచ్చిన స్నేహితులు కాలక్షేపానికి పేకాట ఆడుకున్నారన్నారు. ఈ క్రమంలో వారిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. తాను గవర్నర్‌పేట పోలీసులను కలిసి వివరణ కూడా ఇచ్చానన్నారు. కాలక్షేపం కోసం స్నేహితులు పేకాట ఆడుకుంటే దాన్ని ఉద్దేశపూర్వకంగా తప్పుగా టీవీ చానల్‌లో చూపించారన్నారు. తానే స్వయంగా జూద గృహం నిర్వహిస్తున్నానని ప్రచారం చేయడం సరికాదన్నారు. పోలీసులు వచ్చిన సమయంలో తాను పారిపోయాయని పూర్తిగా అసత్య కథనాలు ప్రచురించారన్నారు. వాస్తవానికి తాను ఆ సమయంలో ఇంటి వద్ద లేనన్నారు. 60 ఏళ్ల వయసులో ఉన్న తనను మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఎన్నో చోట్ల జూద గృహాలు ప్రారంభమయ్యాయని, వాటిపై కథనాలు రాయడం లేదన్నారు. తన ప్రతిష్టను భంగ పరుస్తూ తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని, దీనిపై తాను న్యాయ పోరాటం చేస్తానని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేద్దాం



హర్ ఘర్ తిరంగా ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నకలెక్టర్ సృజన తదితరులు



భారత్ మ్యాప్ ఆకారంలో విద్యార్థుల మానవహారం

కలెక్టర్ డాక్టర్ సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎందరో మహానుభావుల త్యాగాలతో దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ఆ త్యాగమూర్తులను స్మరించుకుంటూ, దేశ సమగ్రతకు, సమైక్యతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సూచించారు. మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, భగత్ సింగ్, లాల్ బహదూర్ శాస్త్రి, ఝాన్సీలక్ష్మీబాయి, సరోజిని నాయుడు, అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య వంటి ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు భరత మాతపై చూపిన ప్రేమ, భక్తి భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య కీర్తిని నలుదిశలా చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలన్న దేశ ప్రధాని సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. అనంతర ఆమె జాతీయ జెండాను చేతబూని విద్యార్థినీ విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజా గాయకుడు పిచ్చయ్య ఆలపించిన దేశ భక్తి గేయాలు ఆలోచింపజేశాయి. జాతీయ జెండాలతో భారత మ్యాప్ ఆకారంలో మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ బి.హెచ్.భవానీశంకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు ఆర్.వి.వి.రోహిణీదేవి, సీహెచ్.శిరీష, సూర్యారావు, ఇంతియాజ్ పాషా, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, నెహ్రూ యువక కేంద్రం కో–ఆర్డినేటర్ ఎస్.రామ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి సహజ యోగా జాతీయ వర్క్‌షాప్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజయోగ ధ్యానంపై ఈ నెల 31, సెప్టెంబర్ 1న నగరంలోని సివిరెడ్డి చారిటీస్ ప్రాంగణంలో రెండు రోజులపాటు జాతీయస్థాయి వర్కుషాప్‌ను నిర్వహించనున్నట్లు సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ తెలిపారు. నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) పేరుతో ఈ వర్కుషాపు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. స్కిల్స్, నాలెడ్జ్, డిజైర్ లక్ష్యంగా ఈ వర్కుషాపు జరుగుతుందని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సహజయోగ ధ్యాన కేంద్రం వివిధ విభాగాల్లోని ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సహజయోగ ధ్యాన కేంద్రం నిపుణులు హాజరవుతున్నార తెలిపారు. నిరంతరం సహజయోగ సాధన ద్వారా మనిషి శారీరక, మానసిక రుగ్మతలను మాయం చేసుకోవచ్చని చెప్పారు. సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటింటికీ సహజయోగం వ్యాప్తి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటి ద్వారా శారీరక, మానసిక ఉన్నతిని పొందవచ్చని తెలిపారు. వర్క్‌షాప్‌నకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 దేశాల్లో సహజయోగాన్ని ప్రజలు ఆచరిస్తున్నారన్నారు.

తూనికుంట్ల సేవలు అద్వితీయం



తూనికుంట్ల శ్రీనివాసును సత్కరిస్తున్న పాలకవర్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాలకు కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందిస్తున్న సేవలు అపూర్వమని ఏపీ ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు అన్నారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసుకు విద్యారంగంలో అందించిన సేవలకు అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా తూనికుంట్ల శ్రీనివాసుకు కళాశాల సిబ్బంది ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెనుగొండ సుబ్బరాయుడు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల పాలకవర్గంలో గడిచిన పాతిక సంవత్సరాలుగా తూనికుంట్ల శ్రీనివాసు విశేష సేవలందిస్తున్నారని చెప్పారు. అలాగే ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల చైర్మన్‌గా, గొల్లపూడి అయ్యప్పస్వామి దేవస్థానం, వాసవి విజయవాడ, అర్బన్ ఆర్యవైశ్య సంఘం, చైతన్య తపోవన్ వంటి అనేక సంస్థలకు ట్రస్టీగా వివిధ హోదాల్లో సేవలందించారని చెప్పారు. ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ శతాబ్దానికి పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో అనేక విద్యా సంస్థలు అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నాయని పేర్కొన్నారు. మినర్వా హోటల్స్ అధినేత మాజేటి సురేంద్రనాథ్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో చక్కని సేవలందించారని కొనియాడారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రముఖులు గోళ్ల బాబావిజయ కుమార్, అన్నం రామకష్టారావు, చిట్టూరి ఆనంద సుధాకర్, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం మాజీ చైర్మన్ కాజా మోహనరావు, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేయకుంటే చంపుతామని బెదిరింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా చంపుతామని బెదిరింపులకు పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీ. నైనవరం గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన బెజవాడ వెంకటేశ్వరమ్మ, రామకృష్ణలు భార్యాభర్తలు. వీరిద్దరి మధ్య విభేదాల కారణంగా విడిగా ఉంటున్నారు. వెంకటేశ్వరమ్మ ఇంట్లో చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తుంటారు. ఇంటి విషయం కోర్టులో దావా నడుస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం పామర్తి మునేశ్వరరావు, సంపూర్ణ, మరి కొంత మంది ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఇల్లు ఖాళీ చేయకుంటే చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జాతీయ పండుగలకు డొల్ల జీవో విడుదల చేశారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జాతీయ పండుగలకు జీవో 450 పేరుతో డొల్ల జీవో విడుదల చేసి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పేర్కొన్నారు. దీనిపై ఆయన ఒక వీడియో విడుదల చేశారు. అందులో పోతిన మహేష్ మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ మైనర్ పంచాయితీలకు పది వేలు, మేజర్ పంచాయితీలకు రూ.25 వేల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నామని జీవో 450ను మంత్రిగా పవన్ కల్యాణ్ విడుదల చేశారని పేర్కొన్నారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటన చేసి ఒక్క పైస కూడా నిధులు విడుదల చేయలేదని తెలిపారు. జీవో పేరుతో ప్రజలను పక్క దొవ పట్టించారని దుయ్యబట్టారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కనీసం రూ.20 కోట్ల రూపాయలు సైతం నిధులు విడుదల చేసే పవర్ లేదా అని ప్రశ్నించారు. దేశభక్తుడని చెప్పుకునే పవన్‌కళ్యాణ్ ఈ జీవో పేరుతో ప్రజలను మోసం చేయటం సమంజసమా అని ప్రశ్నించారు. పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు పెట్టుకోమని మీరు ఉచిత సలహా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఏటా మాదిరిగానే స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. పంచాయతీలకు మీరు ప్రకటన జారీ చేసిన విధంగా ఎప్పుడు నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తారో స్పష్టంగా సమాధానం చెప్పాలని కోరారు.

పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి పంటకాలువ రోడ్డులోని ఖాళీ స్థలంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 10,700 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

పశ్చిమంలో బైక్ ర్యాలీ

గాంధీనగర్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ భవానీపురం ఎన్డీయే కార్యాలయం నుంచి ప్రారంభమైంది. నాయకులతో కలిసి బుల్లెట్ వాహనంపై సుజనాచౌదరి ర్యాలీలో పాల్గొన్నారు. స్వాతి థియేటర్, దుర్గగుడి, బ్రాహ్మణ వీధి, చిట్టినగర్, సితార, ప్రాంతాల గుండా బైక్ ర్యాలీ సాగింది.